క్లుప్తంగా

సోమినాయుడుపాలెంలో మొక్కల పెంపకం

పరవాడ: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని టీడీపీ పరవాడ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న అన్నారు. రావాడ శివారు సోమినాయుడుపాలెంలో సొంత నిధులతో సమకూర్చిన కొబ్బరి మొక్కలను సోమవారం ఆయన నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడానికి ముందుకు రావాలని చిన్న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కె.సన్యాసిరావు, ఎస్.అప్పలనాయుడు, బి.ఈశ్వరరావు, కె.కృష్ణ, కె.నాయుడు, ఎస్.నాయుడు, సోమినాయుడు పాల్గొన్నారు.

తీరంలో క్షీణించిన పారిశుధ్యం



చెత్తతో నిండిన ముత్యాలమ్మపాలెం తీరం

పరవాడ: ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో పారిశుధ్యం క్షీణించింది. బీచ్‌కు వచ్చిన సందర్శకులు తాగి వదిలేసిన బీరు బాటిళ్లు, మద్యం సీసాలు, ఆకులు, టీ కప్పులు, ప్లాస్టిక్ కవర్లు తీరంలో ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. సముద్రం లోపల నుంచి తీరానికి కొట్టుకొచ్చిన చెత్తా చెదారాలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. తీరంలో ఏర్పాటు చేసిన శ్మశానవాటికలో మృతదేహలను తగులబెట్టిన కర్రలు, తదితర సామగ్రి ఎక్కడికక్కడ పేరుకుపోవడంతో బీచ్ అందాలను తిలకించడానికి వచ్చిన సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. తీరాన్ని పరిశుభ్రంగా ఉంచేలా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఉమా చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు



పూజలు అందుకున్న స్వామి

సింహాచలం: అడవివరంలోని చంద్రగార్డెన్స్‌లో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామికి రుద్రాభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు ఉదయ్‌కృష్ణశర్మ, ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 14 మందికి కోర్టు రూ.1,40,000 జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం వారిని జిల్లా 2వ ప్రత్యేక జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వాచ్‌మన్ మృతి



అప్పారావు(ఫైల్)

పెందుర్తి: నిర్మాణంలో ఉన్న ఓ బహుళ అంతస్తు వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తున్న ఓ వృద్ధుడు విద్యుదాఘాతానికి గురై సోమవారం సాయంత్రం మృతి చెందాడు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన అనపర్తి అప్పారావు(60) పెందుర్తి మరిడిమాంబ ఆలయ సమీపంలోని ఓ నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం మోటార్ వేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెందుర్తికి తహసీల్దార్ కావలెను?

ఉమ్మడి జిల్లాలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన రెవెన్యూ మండలం పెందుర్తి. అటువంటి మండలాన్ని జిల్లా ఉన్నతాధికారులు గాలికి వదిలేశారు. కూటమి నాయకుల 'బంతాట' కారణంగా.. ఉన్న తహసీల్దార్‌ను కొనసాగించలేక.. కొత్త తహసీల్దార్‌ను నియమించలేక.. కీలకమైన మండలానికి వారం రోజులుగా అలనా 'పాలనా' లేకుండా చేశారు. సిఫార్సు లేఖల ద్వారా మాత్రమే బదిలీ నిర్ణయాలు తీసుకునే స్థితిలో ఉన్న అధికార యంత్రాంగం దాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేకపోవడం విడ్డూరం. – పెందుర్తి

- వారం రోజులుగా నిలిచిపోయిన ముఖ్య కార్యకలాపాలు
- తహసీల్దార్ నియామకంలో తెగని పంచాయితీ
- మరోవైపు యోగాంధ్రకు సిబ్బందిని కేటాయిస్తున్న వైనం
- అదను చూసి చెలరేగిపోతున్న భూకబ్జాదారులు



తహసీల్దార్ క్యాబిన్

పెందుర్తి రెవెన్యూ పరిధి విస్తీర్ణంతో పాటు జనాభా కూడా ఎక్కువే. దీంతో కార్యాలయం ప్రతి రోజూ 'నిత్య కల్యాణం.. పచ్చతోరణం'చందంగా ఉంటుంది. కార్యాలయంలో కీలక అధికారులు, పూర్తి స్థాయి సిబ్బంది ఉన్నా సరే.. ఓ వైపు అధిక జనాభా.. మరోవైపు ఇతర పని ఒత్తిళ్ల కారణంగా పనులు మందకొడిగా సాగుతుంటాయి. కీలక ధ్రువపత్రాలు, ఇతర సాధారణ పత్రాల జారీలో నిర్ణీత గడువు కంటే జాప్యమవుతుంటాయి. అలాంటిది తహసీల్దార్ సహా కీలక అధికారులు అందుబాటులో లేకపోతే పరస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. పాఠశాలలు, కళాశాలు ప్రారంభించిన క్రమంలో ఓ వైపు విద్యార్థులు ధ్రువపత్రాల కోసం ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు ఇప్పటికే రెచ్చిపోతున్న భూకబ్జాదారులు.. ఇదే అదనుగా భావించి మరింత జూలు విదిల్చారు. మొత్తానికి ప్రస్తుతం పెందుర్తి రెవెన్యూకు 'దిక్కు'లేకుండాపోయింది.



బోసిపోయిన పెందుర్తి రెవెన్యూ కార్యాలయం

పెరుగుతున్న కబ్జాలు

తహసీల్దార్ సహా ఇతర అధికారులు, వీఆర్వోలు పెందుర్తి రెవెన్యూ మండలానికి అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ భూములను కబ్జాదారులు చెరబడుతున్నారు. ఇప్పటికే అధికార తెలుగుదేశం, జనసేన నాయకుల అండతో రెచ్చిపోతున్న భూబకాసురులు తాజాగా జూలు విదిల్చారు. ఎక్కడిక్కడ ప్రభుత్వ భూములు, గెడ్డలు, వాగులు, చెరువులను తుదముట్టిస్తున్నారు. ఆయా కబ్జాకాండలపై ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేసినా 'మేం యోగాంధ్ర డ్యూటీలో ఉన్నాం.. కొత్త తహసీల్దార్‌గారు వచ్చాక చూద్దాం'అంటూ తప్పించుకుంటున్నారు. దీంతో భూబకాసురులు పండగ చేసుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెందుర్తి రెవెన్యూకు పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలని కోరుతున్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

సాధారణ బదిలీల్లో భాగంగా పెందుర్తి తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌ను ఈ నెల 9న అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు. అదే సమయంలో అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి(జీకె వీధి) తహసీల్దార్ రామకృష్ణను పెందుర్తికి నియమించారు. రామకృష్ణ నియామకాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సిఫార్సు చేయడంతో ఆయన బాధ్యతలు తీసుకోవడంలో ఎలాంటి ఆటంకం ఉండదని అంతా భావించారు. అయితే ఆయనపై గతంలో ఉన్న అవినీతి ఆరోపణలు, క్రమశిక్షణ చర్యల గురించి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్.. తహసీల్దార్ రామకృష్ణకు పెందుర్తి బాధ్యతలు ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో పెందుర్తి తహసీల్దార్ పోస్టు ఖాళీ ఏర్పడింది. అదే సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమానికి ఇక్కడి నుంచి సిబ్బందిని పంపుతున్నారు. దీంతో ఒక్కసారిగా పెందుర్తి రెవెన్యూ కార్యాలయం వెలవెలబోతోంది. అర్జీల ఇవ్వడానికి వచ్చిన వారు, ధ్రువపత్రాల కోసం వచ్చిన వారు, ఇతర రెవెన్యూ, సర్వే పనుల కోసం వచ్చిన వారు అధికారులు, సిబ్బంది లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



సిబ్బంది లేక వెలవెలబోతున్న ప్రధాన క్యాబిన్

'యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఫార్మాలో ప్రమాదం'



మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: జేఎన్ ఫార్మా సిటీలోని ఎస్ఎస్ ఫార్మా పరిశ్రమలో ఇటీవల జరిగిన ప్రమాదం మానవ తప్పిదం కాదని, యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యానారాయణ ఆరోపించారు. పరవాడలో ఆయన స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడారు. పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు భద్రత సిబ్బంది మరణించడమే కాకుండా ఓ కార్మికుడు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యాడని చెప్పారు. జరిగిన ప్రమాదాన్ని యాజమాన్యం మానవ తప్పిదంగా దృష్టి మళ్లించి భద్రత డొల్లతనాన్ని కప్పిపుచ్చుకోవాలని చూస్తుందని విమర్శించారు. సాల్వెంట్ ట్యాంక్ వద్ద ఇండికేటర్ కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఘటనా స్థలంలో పీపీ కిట్లు, ఆక్సిజన్‌తో కూడిన మాస్క్‌లను అందుబాటులో ఉంచితే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదన్నారు. పరిశ్రమల్లో క్రమం తప్పకుండా భద్రత ఆడిట్లతో పాటు మాక్‌డ్రిల్ నిర్వహించాలన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి ప్రమాదాలు పునరావృత్తం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నేడు పుస్తకావిష్కరణ

పరవాడ: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 8.30 గంటలకు జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ కార్యక్రమం జరగనుందని పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొంటారని చెప్పారు.

హామీలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పెందుర్తి సమన్వయకర్త అదీప్‌రాజ్
- 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ



సబ్బవరంలో పుస్తకావిష్కరణ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తదితరులు

సబ్బవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీలను గాలికొదిలేసిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విమర్శించారు. సబ్బవరంలోని పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యాలయంలో సోమవారం పార్టీ ముద్రించిన 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి కక్షసాధింపు చర్యలు చేపట్టడం తప్ప రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కూటమి ఏడాది పాలనలో జరిగిన అకృత్యాలు, తప్పులు, అక్రమ కేసులు, వేధింపులను పార్టీ ఈ పుస్తకంలో బహిర్గతం చేసిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అంటేనే జనానికి ఒక నమ్మకమన్నారు. దేశ చరిత్రలోనే మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకుడు గండి రవికుమార్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరాం, బోకం రామునాయుడు, పార్టీ అధికార ప్రతినిధి కొటాన రాము, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్ రాజ్, పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, ఉప్పిలి కనకరాజు, వనం అచ్యుంనాయుడు, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డేపల్లి హేమంత్‌కుమార్, పరవాడ వైస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు, పార్టీ పరవాడ మండల అధ్యక్షుడు కోన రామారావు, మాజీ ఆర్‌ఈసీఎస్ వైస్ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు, వద్దాది అప్పలరాజు, దెడ్డం పద్మావతి, బుస అప్పలరాజు, వార్డు అధ్యక్షులు దాసరి సత్తిబాబు, మెంతి మహేష్, గంర్రెడ్డి మహాలక్ష్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో మంత్రి రవీంద్ర



రవీంద్రకు అప్పన్న చిత్రపటాన్ని అందిస్తున్న ఏఈవో ఆనంద్‌కుమార్

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణలు చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు అష్టోత్తరం పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రం ఆయనకు ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలి



ఎంపీడీవో రమేష్‌నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న టిడ్కో కాలనీ మహిళలు

పరవాడ: అర్హులైన నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పిట్ల మాణిక్యం డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం టిడ్కో గృహ సముదాయం లబ్ధిదారులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొర్లివానిపాలెం టిడ్కో కాలనీలో అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్త పింఛన్ల మంజూరు కోసం ఏడాది కాలంగా ఎదురు చూస్తున్నారన్నారు. టిడ్కో కాలనీలో వీధి లైట్లు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారని, చీకటి పడితే విష జంతువుల మధ్య సావాసం చేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీకి చెత్త బండి రాకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుందన్నారు. కాలనీలో ప్రతి వీధిలో సీసీ కెమెరాలను అమర్చి, రేషన్ డిపో ద్వారా 14 రకాల నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో రమేష్‌నాయుడుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు బంగారమ్మ, కార్యదర్శి అన్నపూర్ణ, సంతోషి, సీతామహాలక్ష్మి, అబద్దం సీతమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

'మేహాద్రి'లో ఈత ప్రమాదకరం



మేహాద్రి రిజర్వాయర్‌లో ఈత కొడుతున్న యువకులను బయటకు పంపుతున్న పోలీసులు

పెందుర్తి: ప్రమాదకరమైన ఊబి, లోతు ఉన్న మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో ఈత చాలా ప్రమాదకరమని పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం మధ్యాహ్నం మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో కొంత మంది యువకులు ఈతకు దిగినట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన సీఐ సిబ్బందిని అక్కడికి పంపి యువకులను బయటకు రప్పించారు. కౌన్సిలింగ్ ఇచ్చి అక్కడి నుంచి పంపారు. ప్రమాదాలు చెప్పి రావు అని.. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

ఈ–శ్రమ కార్డుల నమోదు ప్రారంభం



ఈ శ్రమ కార్డుల గురించి రైతలకు అవగాహన కలిగిస్తున్న అధికారులు

పెందుర్తి: స్థానిక రైతుబజార్‌లోని రైతులు, కలాసీలకు ఈ శ్రమ, ఆయుష్మాన్‌భారత్ హెల్త్ కార్డుల నమోదు తొలి దశ ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక శాఖ ప్రాంతీయ కార్యాలయ జిల్లా ఇన్‌చార్జి వై.అరుణ ఆధ్వర్యంలో నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ముందుగా ఆయా పథకాల గురించి రైతులకు అవగాహన కలిగించారు. పెందుర్తి వినియోగదారుల సేవా సంఘం అధ్యక్షుడు దేముడుబాబు, రైతు బజార్ ఈవో ఎస్.పద్మావతి షర్మిల, సహాయకుడు ఎం.చిన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



రాంపురం పాఠశాలలో కిట్‌లు అందిస్తున్న ఎంపీటీసీ హిమబిందు, రెడ్డి నారాయణరావు

పెందుర్తి: రాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను ఎంపీటీసీ సభ్యురాలు గండి హిమబిందు, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు సోమవారం పంపిణీ చేశారు. ముందుగా తాజా పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు పి.హేమంత్, కె.జయప్రసాద్, సారిపల్లి చరణ్ చైతన్యకు ఈస్ట్ కోస్టు రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ కె.కె.రావు ఆర్థిక సహకారంతో ప్రోత్సాహకాలు అందించారు. హెచ్‌ఎం హెచ్‌ఎం కె.రాము ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని చినముషిడివాడ శాంతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను కార్పొరేటర్ శానాపతి వసంత పంపిణీ చేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బ్యాగ్‌లు, పుస్తకాలు, ఇతర సామగ్రి అందించారు. స్థానిక నేత శానాపతి శంకర్రావు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

సబ్బవరం: వంగలిలో ఏర్పాటు అవుతున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ యూనివర్సిటీ నిర్మాణ సమయంలో ఓ వ్యక్తి ఇటీవల భవనం పైనుంచి జారిపడి మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 9న జారి పడి మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడు షేక్ ఉమరవల్లికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారన్నారు. వారికి మృతి చెందిన సమయంలో రూ.3 లక్షల నష్ట పరిహారం, రూ.15 లక్షల బీమా సదుపాయం కల్పిస్తామని నమ్మబలికి అగ్రిమెంట్ చేయించుకుని వదిలించుకున్నారని ఆమె ఆరోపించారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు ఈ ఘటనపై స్పందించి కంపెనీ భద్రత, సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అని ఆరా తీయాలన్నారు.

నేడు నీరాజంనేయ ఆలయ వార్షికోత్సవం

పెందుర్తి: స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద కొలువైన నీరాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బుద్ద శివాజీ తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు, పూజలు చేస్తామన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశామని చెప్పారు. భక్తులంతా పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జేపీఎల్ విజేత పరవాడ జట్టు

- రన్నరప్ గాజువాక జట్టు

తాటిచెట్లపాలెం: జర్నలిస్ట్స్ ప్రీమియర్ లీగ్(జేపీఎల్) విజేతగా పరవాడ జట్టు నిలిచింది. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో పోర్టు స్టేడియంలో 5 రోజుల పాటు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు జరిగాయి. సోమవారం రాత్రి నిర్వహించిన ఫైనల్స్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన గాజువాక జట్టు 75 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పరవాడ జట్టు ఒక బాల్ మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించి, ట్రోఫీని సొంతం చేసుకుంది. గాజువాక జట్టు రన్నరప్‌గా నిలిచింది. మ్యాచ్‌ల ముగింపు కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.రాము, ప్రధాన కార్యదర్శి ఆర్.రామచంద్రరావు, స్మాల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే గాజువాక శాఖ అధ్యక్షుడు కె.పరశురాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.చంద్రమోహన్, హరనాథ్, నారాయణ గ్రూప్ గంటా రవి, శృతి టిఫిన్స్ రాజు, పవిత్ర రెడ్డి కన్‌స్ట్రక్షన్స్ శ్రీనవాస్‌రెడ్డి, టెక్ విజన్ రాజీవ్ సెంటా, ఈటోర్ నాగేశ్వరరావు, మై పైసా ఎర్రాజీ, పెప్సీ జోగేంద్రకుమార్, సుమంత్ అసోసియేట్స్ సుమంత్, గోల్డెన్ ఫ్యూచర్ డెవలపర్స్ శ్రీనివాస్, శ్రీ బాలాజీ డెవలపర్స్ గణేష్‌కుమార్, లక్కీ షాపింగ్‌మాల్ స్వామి, మ్యాక్ డాక్టర్ శ్రీవల్లి, శ్రీ కశ్యప్ విద్యానికేతన్ కె.శ్రీనివాస్, నిర్వాహకులు రవి, చందు యాదవ్, అవతార్ యాదవ్, రాహుల్, భరత్ మిత్ర బృందం, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏఈకి సమ్మె నోటీసు అందజేత



ఏఈ సింహాచలంకు సమ్మె నోటీసు అందిస్తున్న మంచినీటి సరఫరా విభాగం కార్మికులు

గోపాలపట్నం: జోన్–8 మంచినీటి సరఫరా విభాగం అవుట్ సోర్సింగ్ కార్మికులు సోమవారం బుచ్చిరాజుపాలెం కార్యాలయంలో ఏఈ సింహాచలంకు సమ్మె నోటీసు అందించారు. జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం ప్రకారం ఈ నెల 26వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని.. లేని పక్షంతో 27 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని నోటీసులో పేర్కొన్నారు. గతంలో సమ్మె నోటీసు ఇచ్చిన సందర్భంగా పెరిగిన వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని కార్మికులు తెలిపారు. అయితే వారు ఇచ్చిన హామీ ప్రకారం ఇంతవరకు చెల్లించక పోవడంతో సమ్మె నోటీసు ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

2.5 కిలోల గంజాయి పట్టివేత

విశాఖ సిటీ: ఒడిశా నుంచి బెంగుళూరుకు గంజాయి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిని ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వి.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సిబ్బంది జ్ఞానాపురంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రాజేష్ అనే వ్యక్తి వద్ద 2.5 కిలోల గంజాయిని గుర్తించారు. అతడిని విచారించగా.. ఒడిశా రాష్ట్రంలో దర్లిపుట్ నుంచి కేజీ రూ.5 వేలకు కొనుగోలు చేసి అధికంగా అమ్ముకునేందుకు బెంగళూరుకు వెళ్తున్నట్లు చెప్పాడు. దీంతో అతడిని అరెస్టు చేసి సీతమ్మధార ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ సిహెచ్.రాజేశ్వరి, ఎస్‌ఐ ఎల్.అరుణకుమారి, హెచ్‌సీ కె.వెంకటరావు, కానిస్టేబుళ్లు కె.వీరభద్రరావు, జి.విజయ్‌కుమార్, ఎ.దేవీచంద్ర, ఎస్.తిరుపతిరావు, ఎం.మహేశ్వరి పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యలకు సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ–లీగల్: న్యాయ స్థానాలలో వయోవృద్ధులకు సంబంధించిన వివాదాలు త్వరితగతిన పరిష్కారం కానున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు స్పష్టం చేశారు. సోమవారం కోర్టు ఆవరణలో ప్రపంచ వయోవృద్ధుల వేధింపులపై అవగాహన దినోత్సవాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంరక్షణ చట్టంలోని పలు కీలక అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా న్యాయ పీఠం అధ్యక్షులు జి.వల్లభనాయుడు, జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల సంరక్షణ అధికారి కె.కవిత, సామాజిక కార్యకర్త ఎం.సత్యనారాయణ, న్యాయసేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాదులు, పారా న్యాయ సహాయకులు, వయోవృద్ధులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.